
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 27 మార్చి 2024



శివపార్వతుల కళ్యాణానికి ముస్తాబు 7

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్ల 21 లక్షలు



ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ



- జిల్లాలో 1.73 లక్షల ఎకరాల్లో వరిసాగు
- దిగుబడి అంచనా 3.81 లక్షల మెట్రిక్ టన్నులు
- పౌరసరఫరాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- ఏప్రిల్‌లో ధాన్యం సేకరణ
- జిల్లాలో 259 కొనుగోలు కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. వచ్చే నెల రెండో వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు రానుండడంతో అందుకు అనుగుణంగా అధికారులు యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. కొనుగోళ్లకు అవసరమయ్యే సామగ్రి అందుబాటులో ఉంచే ఏర్పాట్లపై దృష్టి సారించారు. జిల్లాలో యాసంగిలో 1.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1.73 లక్షల ఎకరాల్లో వరి వేశారు. వరిసాగుకు అనుగుణంగా దిగుబడిపై పౌర సరఫరాల శాఖ యాక్షన్‌ప్లాన్ తయారు చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం క్వింటాల్ ధాన్యం ధర ఏ గ్రేడ్ రూ.2203, బీగ్రేడ్ రూ.2183 చొప్పున కొనుగోలు చేయనున్నారు. ఏప్రిల్ రెండోవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

దిగుబడి అంచనా

జిల్లాలో యాసంగి సీజనల్‌లో 1.73 లక్షల వరి సాగు ద్వారా 3.81 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 81 వేల మెట్రిక్ టన్నులు మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తారని నిర్ణయించారు. పౌర సరఫరాల శాఖ ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ రెండో వారం నుంచి 50 వేల మెట్రిక్ టన్నులు, మేలో 2.50 లక్షల మెట్రిక్ టన్నులు, జూన్‌లో 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ ఏప్రిల్‌లో 50 వేలు, మేలో 2,09,500, జూన్‌లో 40,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలోని అన్ని గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా 259 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. ఐకేపీ ద్వారా 44 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 201 కేంద్రాలు, డీసీఎంఎస్‌ద్వారా 10 కేంద్రాలు, మెప్మాద్వారా నాలుగు కేంద్రాల ఏర్పాటుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఉపయోగించడానికి గన్నీ బ్యాగులు కొత్తవి 21.85 లక్షలు, ఇప్పటికే ఉపయోగించినవి 5.28 లక్షలు అందుబాటులో ఉన్నాయి. కొనుగోళ్ల కోసం టార్పాలిన్లు, 8024, ఇన్నోవింగ్ మిషన్లు 265, పాడీ క్లీనర్‌లు 610, మ్యాయిశ్చరైజ్ మీటర్లు 550, వేయింగ్ మిషన్లు 700, అస్క్ రిమూవర్స్ 265, వంటి పరికాలు అందుబాటులో ఉంచారు. జిల్లాలో 100 రైస్‌మిల్లులు ఉండగా 72 రా రైస్‌మిల్లు, 28 బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటికి ధాన్యాన్ని కేటాయించనున్నారు.

జిల్లాలో వరి సాగు (ఎకరాల్లో)

మండలం	వరి
గంభీరావుపేట	17,318.04
ఇల్లంతకుంట	25,024.27
ముస్తాబాద్	19,903.28
సిరిసిల్ల	4783.13
తంగళ్లపల్లి	18,851.19
వీర్నపల్లి	6204.01
ఎల్లారెడ్డిపేట	16,512.32
బోయినపల్లి	13,079.12
చందుర్తి	15,182.01
కోనరావుపేట	17,141.03
రుద్రంగి	4112
వేములవాడ	5142.37
వేములవాడ రూరల్	10,487.11
మొత్తం	1,73,742.28

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియలో ఎన్నికల ప్రవర్తన నియామావళిని తప్పకుండా పాటించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో యాసంగి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉన్నందున ప్రజాప్రతినిధుల ఫొటోలు, రాజకీయ పార్టీల గుర్తులు ప్రతిబింబించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంట కోతలకు అనుగుణంగా ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకుండా చూడాలని అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలని అన్నారు. రైతుల వద్ద నుంచి షెడ్యూల్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్దతు ధరపై ఎక్కడా ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 259 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని గ్రేడ్ ఏ రకం క్వింటాలుకు రూ.2203, సాధారణ రకం రూ.2183 మద్దతు ధర చెల్లించనున్నట్లు చెప్పారు. కొనుగోళ్ల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, టార్పాలిన్లు, క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ధాన్యం నాణ్యత ప్రమాణాల మిషన్లు ఏర్పాటు చేయాలన్నారు. తేమ శాతం 17లోపు ఉండేలా విస్తృత ప్రచారం చేయాల న్నారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హమాలీ కొరత రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలన్నారు. ఖరీఫ్ 2023 - 24కు సంబంధించి సీఎంఆర్, రా రైస్, ఎఫ్‌సీఐకు అందించే విధంగా పర్యవేక్షించాలన్నారు. 2022- 23 యాసంగి సీజన్‌కు సంబంధించి 95,416 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఏవో భాస్కర్, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, డీసీవో రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికి మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రకటించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీవీసీ హాల్‌లో మంగళవారం ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో 560 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 647మంది ప్రిసైడింగ్ అధికారులు, 674 మంది సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 1348 మంది ఓపీవోలను కేటాయించనున్నట్లు చెప్పారు. సీపీవో శ్రీనివాసచారి, డీఈవోఈడీ ఎం.శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రుద్రంగి, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సహకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం రుద్రంగి పోలీసు స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. రుద్రంగి ఎస్సై అశోక్, హెడ్ కానిస్టేబుళ్లు పద్మారావు, బాపురెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.2.21 లక్షలు

వేములవాడ టౌన్, మార్చి 26 : వేములవాడ మండలం అగ్రహారం అంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2 లక్షల 21 వేల 877 సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అంజన్న ఆలయ మూడు నెలల హుండీ ఆదాయాన్ని ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో వ్యవస్థాపక వంశీయధర్మకర్త గౌరిశెట్టి మహేందర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి మారుతి, హుండీ పరిశీలకుడు నాగారపు శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో ఆలయ సిబ్బంది, సత్యసాయి సేవ సమితి భక్తులు లెక్కించారు.

మహిళల రక్షణే షీటీమ్ ప్రధాన లక్ష్యం

ముస్తాబాద్, మార్చి 26: మహిళల రక్షణే షీటీమ్ ప్రధాన లక్ష్య మని షీటీమ్ ఏఎస్సై ప్రమీల అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని నవజ్యోతి ఇంగ్లీష్ మీడియంలో విద్యార్థులకు మంగళ వారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను షీ టీమ్ దృష్టికి తీసుకురావాలన్నారు.సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. 8712656425కు బాధితులు సమాచారం అందించాలని, వివ రాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ప్రిన్స్‌పాల్ ప్రకాశ్, స్రవంతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26: ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు దరువు ఎల్లన్నను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయం, ప్యాక్స్ కార్యాలయంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి మంగళవారం వేర్వేరుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు శంకర్, మధుకర్, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధోగానికి కేటీఆర్‌కు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, మార్చి 26: ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలక హాజరు కావాలని మండలంలోని మండెపల్లికి చెందిన గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యే కే తారకరామారావును ఆహ్వానించారు. మంగళవారం కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఎన్‌పీడీసీఎల్ ఏడీ ప్రదీప్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సెస్ అధికారులుతో కలిసి మంగళవారం విద్యుత్ సబ్ స్టేషన్, స్తంభాలు, తీగలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కరెంటు సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్(పీటీఆర్)లో తలెత్తిన సమస్యతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. గ్రామానికి ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరాను అందించినట్లు చెప్పారు. మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని ఏడీ ప్రదీప్ తెలిపారు. ఏఈలు పద్మ, పృథ్వీ ఉన్నారు.

స్టడీ సర్కిల్‌ను త్వరగా ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల రూరల్, మార్చి 26: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌ను త్వరగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఎస్సీ స్టడీ సర్కిల్ కోసం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తీసుకున్న అద్దె భవనాన్ని మంగళవారం స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అద్దె భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులు త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వీర్నపల్లి, మార్చి 26: బాధితులు ఇచ్చే ప్రతీ ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వీర్నపల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నేరాల నియంత్రణకు అధికారులు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది 24 గంటలు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను గుర్తించాలని, ప్రత్యేక నిఘా పెట్టాలని అన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమేష్ ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

చందుర్తి, మార్చి 26: మండలంలోని మర్రిగడ్డలో రెడ్డికుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మకు బోనాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. జడ్పీటీసీ నాగం కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, ఎంపీటీసీ దారం కావ్యశ్రీ బాల్‌రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు దూది శ్రీనివాస్ రెడ్డి, దారం రాజశేఖర్, నాయకులు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనిల్, ధర్మపురి శ్రీనివాస్, మధు, హన్మంతరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తనిఖీ



మాట్లాడుతున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ సుభాషిణి

సిరిసిల్ల క్రైం/వేములవాడ, మార్చి 26: సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మంగళవారం స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ డీఐజీ సుభాషిణి తనిఖీ చేశారు. రికార్డు గదులు, కంప్యూటర్ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. అవకతవకలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. సబ్ రిజిస్ట్రార్‌లు పార్థసారధి, చెర్ల సురేంద్రబాబు ఉన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 26 : సంక్షోభంలోఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని మంగళవారం హైదరాబాద్‌లో అఖిల భారత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు సిరిసిల్ల పద్మశాలీ సంఘం, చేనేత వస్త్ర వ్యాపార సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందకట్ల స్వామి, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర్సు మురళి, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను కలిశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను వివరించారు. సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిరిసిల్ల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల ఏఆర్‌వో పరిధిలోని సెక్టార్, పోలీస్ ఆఫీసర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సెక్టార్, పోలీస్ ఆఫీసర్లు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను బీఎల్‌వో లేదా గ్రామ ప్రత్యేక అధికారులతో కలిసి సందర్శించాలని సూచించారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు తెలుసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలను పరిశీలించాలన్నారు. సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు ఉంటే పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. పోలింగ్ తక్కువ నమోదైన కేంద్రాల వివరాలు ఉండాలన్నారు. ఎన్నికలకు ఒక రోజు ముందు, ఎన్నికల రోజు చేపట్టాల్సిన విధులపై సిరిసిల్ల ఆర్డీవో రమేష్ సెక్టార్ ఆఫీసర్ల వివరించారు. పోలింగ్ రోజు ఉదయం నిర్వహించే మాక్ పోలింగ్, పోలింగ్ ముగిసిన అనంతరం చేయాల్సిన పనులపై వెల్లడించారు. అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా, సీ విజిల్, సువిధ, ఇతర ఎన్నికల యాప్‌ల వినియోగం పై అవగాహన కల్పించాలని సూచించారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ షరీఫ్ మోహి నుద్దీన్, సెక్టోరియల్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యమానేరులో మట్టి నింపడంపై పోలీసులకు ఫిర్యాదు

తంగళ్లపల్లి, మార్చి 26: నిబంధనలకు విరుద్ధంగా మధ్య మానేరు ప్రాజెక్టులో మట్టి నింపిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులో మధ్య మానేరు నుండి అంతగిరి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణం చేపట్టారు. కాల్వ పనులు నిర్వహించిన ప్రతిమ కన్స్ట్రక్షన్ నిబంధనలకు విరుద్ధంగా కాలువ నిర్మాణంలో తోడిన మట్టిని మధ్య మానేరులో డంపు చేశారు. దీంతో మధ్య మానేరులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని డంపు చేసిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య పేర్కొన్నారు.

దాడిలో గాయపడ్డ వివాహిత మృతి



మేడిశెట్టి రమ

జగిత్యాలరూరల్, మార్చి 26 : కూతురిని తనకిచ్చి పెళ్లి చేయలేదన్న కోపంతో ఓ యువకుడు వివాహితపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి రమ (40) అనే మహిళకు కొడుకు రిషి, కూతురు వాణి ఉన్నారు. భర్త సురేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. దీంతో రమ స్వగ్రామమైన తిప్పన్నపేటలో నివాసం ఉంటోంది. అదే గ్రామానికి చెందిన బోగు ప్రకాశ్ రమ కూతురు వాణిని పెళ్లి చేసుకుంటానని కొన్ని రోజుల నుంచి వెంటపడుతున్నాడు. దీనికి రమతో పాటు కుమారుడు నిరాకరించారు. ఇదే విషయమై పలుమార్లు వీరి మధ్య గొడవలు జరిగాయి. వాణితో తనకు పెళ్లి కాకుండా అడ్డు పడుతోందనే కారణంగా రమపై ప్రకాశ్ కోపం పెంచుకున్నాడు. రమను చంపేస్తే తన పెళ్లికి ఎవరూ అడ్డుపడరని భావించాడు. సోమవారం తిప్పన్నపేటలో జరిగిన హోలీ వేడుకల్లో భా గంగా రమతో పాటు ఆమె కొడుకుతో గొడవ పడ్డారు. ప్రకాశ్ కొడవలితో రమ గొంతుపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను కరీం నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రమ కుమారుడు రిషి ఫిర్యాదు మేరకు బోగు ప్రకాశ్‌పై హత్య కేసు నమోదుచేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకున్న నారసింహుడు

● ధర్మపురిలో ఘనంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ● పాల్గొన్న జగిత్యాల డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కళ్యాణం, తెప్ప, డోలోత్సవాల అనంతరం స్వామి వారలు దక్షిణం వైపు విహార యాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని దక్షిణ దిగ్యాత్రగా చెబుతుంటారు. ఈ దిగ్యాత్రలో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకవచ్చారు. అనంతరం సేవలపై ఉంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా, రిటైర్డ్ ఏఎస్‌ఐ కమటం మల్లయ్య, వివిధ రకాల వేషాధారణ, చిన్నారుల నృత్యాలు, బొప్పనపెల్లి ఐలయ్య ఒగ్గు డోలు ప్రదర్శనతో సాయంత్రం వేళలో దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్ వైపు తీసుక వెళ్లారు. దారి పొడవుగా పోలీస్ సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ గేటు ఎదుట పోలీస్ కుటుంబ సభ్యులు, పలువురు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామి వారల సేవలను పోలీస్‌స్టేషన్‌లోకి ఆహ్వానించారు. జగిత్యాల, డీఎస్పీ రఘుచందర్ ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌బీ సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది స్వామి వారల సేవలను భుజాలపైకి ఎత్తుకుని మోసి లోనికి ప్రవేశించారు. స్వామివారల సేవలను పోలీస్ స్టేషన్ ఆవరణలో అందంగా పూలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉంచారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛ రణల మధ్య యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ అధికారులు తమ ఆయుధాలు స్వామి వారి సేవల పక్కన ఉంచి పూజలు నిర్వహించడం అనాదిగా వస్తుంది. అనంతరం వేద పండితులు, అర్చకులను పోలీస్ శాఖ పక్షాన శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న స్వామివారి సేవలను భుజాలపై మోస్తున్న ధర్మపురి సీఐ, ఎస్‌ఐ, పోలీస్ అధికారులు



బ్రహ్మపుష్కరిణిలో శ్రీ వేంకటేశ్వరుని తెప్పోత్సవం

ఘనంగా శ్రీ వేంకటేశ్వరుని డోలోత్సవం

ధర్మపురి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య మధ్యాహ్నం ఉత్సవ మూర్తిని సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం పురవీధుల గుండా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)కు తీసుకువచ్చారు. బ్రహ్మ పుష్కరిణిలో హంస వాహనపైన ఉంచిన స్వామి వారల సేవలను ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించి అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేసి అర్చకులు డోలోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్ల 21 లక్షలు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రూ.2 కోట్ల 21 లక్షలకుపై ఆదాయం సమకూరింది. 21 రోజుల వ్యవధిలో భక్తులు స్వామవారి హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 21 లక్షల 29 వేల 350 రూపాయల నగదు, 463 గ్రాముల బంగారం, 19 కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు పట్టివేత

గంభీరావుపేట, మార్చి 26: గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్ పోస్ట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 1.52లక్షల నగదును మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. సిరిసిల్లకు చెందిన సతీష్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.92 వేల నగదును, గోరంటాలకు చెందిన సత్తవ్వ ఆధారాలు లేకుండా రూ.60 వేల నగదును తీసుకెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. నగదును సీజ్ చేసి, ఎన్నికల సెల్ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్టు ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

మల్యాల : ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న నగదును కొండగట్టు బస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన నిమ్మ శివన్న అనే వ్యక్తి కరీంనగర్ నుంచి ఎర్టీగా వాహనంలో లోకేశ్వరంకు రూ.54,500 తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించిన ఆధారాలు లేనందున సీజ్ చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి ముస్తాబు

● నేటి నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు ● 28న స్వామి వారి కల్యాణం.. 30న రథోత్సవం



వేములవాడ ఆలయం



వేములవాడ ఆలయంలో కల్యాణం కోసం ఏర్పాట్లు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం శివకల్యాణోత్సవాలకు ముస్తాబవుతోంది. ఐదు రోజుల పాటు అత్యంత ఘనంగా జరిగే ఈ వేడుకల కోసం ఆలయ అధికారులు సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీ బుధవారం నుంచి 31వ తేదీ ఆదివారం వరకు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు పార్వతీ రాజరాజేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. నాల్గవ రోజు 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05ని.ల నుంచి స్వామివారి రథోత్సవం 31వ తేదీ ఆదివారం శివ కళ్యాణోత్సవాలు ముగుస్తాయి. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ఉత్సవాల కోసం ఆలయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆలయంలోని స్వామివారి కల్యాణ మండపంలో శివ కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తుండగా, ప్రతి ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి ఆలయ చైర్మన్ చాంబర్ ముందు గల ఖాళీ స్థలంలో శివ కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో పందిళ్లు వేయడంతో పాటు అందమైన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాల కోసం యాగశాల నిర్మించారు. ఆలయ గోపురాలను, ప్రాకారాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఈ సందర్భంగా దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణము, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకళ్యాణోత్సవము సందర్భముగా 28వ తేదీ శుక్రవారం రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు కోడె టికెట్లు జారీ నిలిపివేస్తా మని, నిత్య చండీ సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వనున్నట్లు వారు వెల్లడించారు.

భూ ఆక్రమణ కేసుల్లో పలువురి అరెస్టు

● వేర్వేరు కేసుల్లో జడ్పీటీసీ భర్త, కార్పొరేటర్ భర్త అరెస్టు ● అప్పటి తహసీల్దార్ సహా పలువురిపై కేసు



మాజీ సర్పంచ్ పిట్టల రవీందర్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు



ఆకుల ప్రకాష్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్



మంద నగేష్, తిరుపతి విష్ణువర్ధన్‌లను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 26: నకిలీ పత్రాలతో భూఆక్రమణకు పాల్పడిన కేసులో కొత్తపల్లి జడ్పీటీసీ భర్త, చింతకుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవీందర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్‌కు వచ్చిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన పామ్‌రాజ్ గోవిందరావుకు 1954వ సంవత్సరం కాస్రా పహాణి ద్వారా చింతకుంట గ్రామ శివారు సర్వే నంబర్ 106లో ఐదు ఎకరాల 8 గుంటల భూమి ఉండేది. ఆ భూమిలో కుటుంబ సభ్యులు అందరూ అమ్ముకోగా 20 గుంటల భూమి మిగిలి ఉండేది. ఈ 20 గుంటల భూమి ధరణిలో తన తండ్రి పేరే ఉండేదని పామ్‌రాజ్ గోవిందరావు కుమారుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పహాణిలో మాత్రం పేరు టాంపర్ అయి అక్రమంగా న్యాలమడుగు చిన్న వీరయ్య పేరు వస్తున్నది. దీనిని గ్రహించిన అప్పటి సర్పంచ్ పిట్టల రవిందర్ ఆ భూమిని కాజేయాలని వీరయ్య పేరు గల మరో వ్యక్తి కొడుకు రాజయ్య పేరుపై అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి ద్వారా కుమ్మక్కై తప్పుడు విరాసత్ ద్వారా ధ్రువపత్రాలు తయారు చేయించాడు. రాజయ్య నుంచి ముందుగానే నిర్ణయించుకున్న పథకం ప్రకారం గడ్డం ఆదిరెడ్డి పేరున 2009 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించారు. 2010 సంవత్సరంలో ఆదిరెడ్డి నుంచి పిట్టల రవీందర్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తప్పుడు పత్రాలు అడ్డుపెట్టుకుని దానిని దౌర్జన్యంగా దున్నుతున్నాడని, అడ్డుగా వెళ్తే ఆ భూమి తనదేనని, ఇంకోసారి మీరు వస్తే చంపేస్తానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని బాధితుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని వెల్లడి కావడంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, దీనికి సహకరించిన అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి, న్యాలమడుగు రాజయ్య, గడ్డం ఆదిరెడ్డిలపై కేసు నమోదు చేశారు. నిందితుడు పిట్టల రవీందర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో ఒకే భూమిని పలువురికి విక్రయం

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలను సృష్టించి ఒకే భూమిని పలువురికి విక్రయించి, మోసం చేసి, బెదిరింపులకు గురిచేసిన ఘటనలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రకాశ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ గ్రామంలో తొమ్మిద్రు నర్సింహారావు 1998లో సర్వే నంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటలు, 161/ఎఫ్‌లో 9 గుంటలు. 162/ఎఫ్‌లో 14 గుంటలు మొత్తం 33 గుంటలు భూమిని కొనుగోలు చేసి ప్లాట్‌లుగా విభజించి పలువురికి విక్రయించాడు. ఇందులో తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన వంతడుపుల సంపత్ అనే వ్యక్తి తొమ్మిద్రు నర్సింహారావు వద్ద 1998లో ఒక ప్లాటును కొనుగోలు చేసాడు. ఇదిలా ఉండగా తొమ్మిద్రు నరసింహారావు పలువురికి విక్రయించిన భూమిని అక్రమంగా మళ్లీ తనపేరిటనే విక్రయ దస్తావేజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని కరీంనగర్ గోదాంగడ్డకు చెందిన అబ్దుల్ హఫీజ్‌కు 33 గుంటలు గుత్తాగా విక్రయించగా, అబ్దుల్ హఫీజ్ అందులో నుంచి సర్వే నెంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటల భూమిని కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. తిరిగి ఆ భూమిలో నుంచి 3 గుంటలు భూమిని కట్టరాంపూర్‌కు చెందిన ఉప్పు సురేష్, వావిలాలపల్లికి చెందిన కట్ట రమ్యలు కావాలనే దురుద్దేశంతో తక్కువ ధరకు కొనుగోలుచేసి అసలు విక్రయదారులైన వారిని ఆ భూమిలోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితుడు వంతడుపుల సంపత్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ చేపట్టారు. విచారణలో బాధితుడు వివరాలు నిజమేనని వెల్లడి కావటంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, అతనికి సహకరించిన ఐదుగురు తొమ్మిద్రు నరసింహారావు, ఆకుల ప్రకాష్, మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్, ఉప్పు సురేష్, కట్ట రమ్యలపై ఎస్సీఎస్టీ కింద కేసు నమోదు చేశారు. కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, నిందితుడికి 14 రోజుల రిమాండు విధించి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో బెదిరించి 5 లక్షలు దోపిడీ - రౌడీషీటర్‌తో పాటు మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలు సృష్టించి, మోసపూరితంగా వాటిని చూపి ఒక వ్యక్తిని బెదిరింపులకు గురిచేసి 5 లక్షల దోపిడీకి పాల్పడిన కేసులో రౌడీషీటర్ తిరుపతి విష్ణువర్ధన్, కాంగ్రెస్ నాయకుడు మంద నగేష్‌లను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం వెదురుగట్టు గ్రామానికి చెందిన పంబాల శ్రీనివాస్ తీగలగుట్టపల్లిలోని కార్తికేయ నగర్‌లో సర్వే నెంబర్ 233/ఇలో ప్లాట్ నెంబరు 120/ఏలో 200 చదరపు గజాల స్థలాన్ని గట్టు లక్ష్మి పేరిట కొనుగోలు చేశాడు. ఆ భూమికి తప్పుడు పత్రాలను చూపించి పంబాల శ్రీనివాస్‌ను రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. 5 లక్షల రూపాయలు శ్రీనివాస్ వారికి ఇచ్చాడు. మరో 15లక్షలు కావాలని డిమాండ్ చేయడంతో పంబాల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని నిర్ధారించారు. రౌడీషీటర్ పద్మశాలివాడకు చెందిన తిరుపతి విష్ణువర్ధన్, కాపువాడకు చెందిన మంద నగేష్‌ను అరెస్టు చేసి మంగళవారం రాత్రి కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనలో తీగలగుట్టపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, తిరుపతి నితిన్‌వర్ధన్‌లపై కేసు నమోదైనట్లు తెలిపారు.

ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి, బాబాయ్‌పై ఫిర్యాదు

బోయినపల్లి, మార్చి 26: శ్రీ రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో భాగంగా ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి సౌమ్య, బాబాయ్ గంద్రవెంకటరమణరావు అక్రమాలకు పాల్పడ్డారని రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య మంగళవారం బోయినపల్లి ఎస్‌ఐ పృథ్వీధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా కొదురుపాక గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ బీపీఎల్ కింద ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం పొందారని, అతని సోదరి సౌమ్యకు వివాహం అయినప్పటికీ అక్రమంగా పట్టా పొందారని, అతని బాబాయ్ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెంది గంద్ర వెంకటరమణారావు కూడా అక్రమంగా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, పట్టా పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ పట్టాలు, అక్రమంగా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీకి పొందిన వారిపై, సహకరించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 26 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 20 మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు, మైనర్‌కు 3 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఏడుగురు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్షతో పాటు మొత్తం 16 వేల రూపాయలు జరిమానా విధించారని, మరో 12 మందికి 17 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. నగరంలో ప్రతి రోజు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రమాదాల బారినపడి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తలపెట్టవద్దని సూచించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: అతివేగంతో అజాగ్రత్తగా ఆటో నడిపి బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీస్‌లు తెలిపారు. జమ్మికుంటకు చెందిన సుంకిత భవాణి తన భర్తతో కలిసి బైక్‌పై కోరపల్లి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కోరపల్లి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో గౌతమి హాస్టల్ ఎదుట బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆజాగ్రత్తగా నడిపిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: తన తల్లితో సహజీవనం చేస్తున్న ఓ వ్యక్తి తన భర్తను కులం పేరుతో దూషించి కత్తితో పొడిచాడని బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన మానుపాటి పూజిత తల్లి పూలమ్మతో ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన బొమ్మిడి రాజు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల అతిగా మద్యం తాగి వచ్చిన రాజు పూలమ్మను కొట్టడంతో పూజిత తను ఉంటున్న హౌసింగ్‌బోర్డుకు తల్లిని వెంట తీసుకు వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన రాజు అక్కడకు చేరుకుని పూజిత భర్త సురేష్‌ను కులం పేరుతో దూషించి వంట గదిలో ఉన్న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పంచాయతీ పెద్దలపై కేసు నమోదు

రామడుగు, మార్చి 26: పంచాయతీ పెద్దలుగా వ్యవహరిస్తూ ఒకరి సొమ్మును కాజేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గడ్డం వేణు తన భార్యతో విభేదాలు రావడంతో కోర్టు ద్వారా విడాకుల కోసం అంగీకారం కుదుర్చుకున్నాడు. ఈ అంగీకారంలో పంచాయతీ పెద్దలైన రాజు, మల్లేశంలు వేణు నుంచి రెండు లక్షలు తీసుకొని వారి మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్నారు. కాగా బార్యభర్తలకు కోర్టు ద్వారా విడాకుల మంజూరు పూర్తి కాకముందే ఆ ఇద్దరు పెద్ద మనుషులు వేణుకు తెలియకుండా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్న రూపాయలను విత్‌డ్రా చేసుకొని సొంతానికి వాడుకున్నారు. సదరు డబ్బులు తనకు ఇవ్వకుండా వేధిస్తూ మోసం చేస్తున్నారని వేణు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఇద్దరు పెద్ద మనుషులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహేతర సంబంధం ఘటనలో ఏఎస్‌ఐ సస్పెండ్

ఇబ్రహీంపట్నం, మార్చి 26: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదురాలితో వివాహేతర సంబంధం పెట్టుకున్న జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ రాములును సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్1 ఐజి ఎ.వి. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మహిళ తన భర్త రెండు సంవత్సరాలుగా వేధింపులకు గురి చేస్తున్నాడని తగిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్‌ఐ రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాధిత మహిళను నమ్మించి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. న్యాయం చేస్తానని బాధిత మహిళను నమ్మించాడు. మహిళ ఫోన్‌నంబర్ తీసుకుని ముచ్చటించడంతో పాటు అమెతో వివాహేతర సంబంధం కొనసాగించాడు.

ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న ఏఎస్‌ఐ రామయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు మల్టీజోన్ -1 ఐజీ ఎ.వి.రంగనాథ్ వెల్లడించారు.

భార్య ఆత్మహత్యకు మరో మహిళ కారణమని హత్య

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. గ్రామంలో పులి రేణుక (40) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ ఆత్మహత్యకు కారణమనే అనుమానంతో పులి పద్మ (45) అనే మహిళను రేణుక భర్త పులి గంగన్న కల్లు గీసే ఉలితో పొడిచి హత్య చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

నాలుగేళ్ల నుంచి రేణుకకు పద్మకు గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో పద్మ ఇటీవల ఫిర్యాదు చేసింది. ఇటీవల రేణుకను మంత్రాల నెపంతో పద్మ మానసికంగా ఇబ్బందులకు గురి చేసింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రేణుక మంగళవారం భర్త ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పని ముగించుకుని ఇంటికి చేరుకున్న భర్త గంగన్న ఇంట్లో ఆత్మహత్య చేసుకుని ఉన్న భార్యను చూసి షాక్‌కు గురయ్యాడు. తన భార్య మృతికి పద్మ కారణమనే అనుమానంతో ఆవేశానికి గురైన గంగన్న తన వద్ద ఉన్న కల్లు గీసే ఉలితో పద్మ ఇంట్లోకి వెళ్లి ఆమెను పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన ధర్మపురి మండలం కమలాపూర్‌లో తీవ్ర విషాదం నింపింది.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

మల్యాల, మార్చి 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న తనను కాదని విడాకులు తీసుకొని మరొకరిని వివాహం చేసుకోవడం జీర్ణించుకోలేని మొదటి భర్త వివాహితను హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మల్యాల సీఐ నీలం రవి హత్య కేసు వివరాలను మంగళవారం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేష్ జగిత్యాలలో వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తుండగా జగిత్యాలకు చెందిన కరిపె అంజలితో 2018లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో 2020లో వివాహం చేసుకున్నారు. సంతానం కలుగకపోవడం, మనస్పర్థలతో తరచూ గొడవలు జరుగడంతో 2022లో ఇద్దరు విడాకులు తీసుకున్నారు. అయినప్పటికీ అంజలికి నరేష్ ఫోన్ చేస్తూ వేధించేవాడు. ఈ క్రమంలోనే అంజలికి యాదాద్రి జిల్లా గుండాల మండలం మాసంపల్లికి చెందిన వ్యక్తితో రెండవ వివాహం జరిగింది. రెండో పెళ్లి చేసుకొని తనను మోసం చేసిందని ఎలాగైని అంజలిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నరేష్ మళ్లీ అంజలికి ఫోన్ చేసి మాయమాటలు చెప్పి జగిత్యాలకు రమ్మని చెప్పాడు. అంజలి కూడా తాను రాను అని తేల్చి చెప్పాలని అనుకొని ఈ నెల 17న జగిత్యాలకు రాగా అక్కడ ఇద్దరు కలుసుకున్నారు. తరువాత జగిత్యాలలో మద్యం కొనుగోలు చేసుకున్న నరేష్ మాట్లాడుకుందామని చెప్పి అంజలిని తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని గొల్లపల్లి, రాయపట్నం మీదుగా మ్యాడంపల్లి శివారు వైపు తీసుకెళ్లాడు. ఎటు తీసుకెలుతున్నావని అంజలి అడుగడంతో ఆమెపై దాడి చేయడంతో పాటు గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలో గల కాలువలో పడేసి వెళ్లాడు. చెప్పులు, చున్నీ, సెల్‌ఫోన్ సంచిలో వేసి పొదల్లో వేసి వెళ్లాడు. మరుసటి రోజు మృతదేహం సమాచారం తెలియడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి గుజ్జుల రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నరేష్ పోలీసులకు దొరకకూడదనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ పారిపోతుండగా మంగళవారం కొండగట్టు వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో పట్టు బడ్డాడు.

నరేష్ వద్ద రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు. అంజలి జగిత్యాలకు వచ్చే ముందు ఈ నెల 15న యాదాద్రి జిల్లా గుండాలలో అదృశ్యం కేసు నమోదు కాగా 17న మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో హత్యకు గురైనట్లు తేలింది.

కాలువ పూడ్చివేతతో ఎండుతున్న పంటలు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

తంగళ్లపల్లి, మార్చి 26: రైల్వే పనుల్లో చెరువు నుంచి పొలాలకు సాగునీరు అందిచే కాలువను పూడ్చి వేశారని, దీంతో సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం రామన్న పల్లె గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎల్లమ్మ చెరువు వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవు కాలువతోపాటు మూడు కల్వర్టులను నిర్మించారని, ఈ కాలువ ద్వారా పొలాలకు చెరువు నుంచి నీరందుతుండగా ప్రస్తుతం రైల్వే పనుల్లో భాగంగా కాలువను మూసివేశారని అన్నారు. కాలువ పనులను నిలిపివేయాలని అధికారులను కోరినా రైల్వేలైన్‌కు సంబంధించిన మ్యాపులో కాలువ లేదని చెబుతున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, పూడ్చిన కాలువకు మరమ్మతు చేయాలని కోరారు.

రాజ్యాంగం జోలికి వస్తే భూస్థాపితమే



నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

గంభీరావుపేట, మార్చి 26: రాజ్యాంగం జోలికి వస్తే ఎవరైనా భూస్థాపితమే అవుతారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దోసల చంద్రం మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని కర్ణాటక ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలను, ఎంపీలను చేసింది రాజ్యాంగమనే విషయాన్ని మరిచి మాట్లాడే నాయకులకు వచ్చే ఎన్నికల్లో పుట్టగతులు ఉండవన్నారు. మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ దళితులపై, ముస్లింలపై, క్రైస్తవులపై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దాడులు కొనసాగిస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కుల, మతాల పేరుతో ప్రజల్లో చిచ్చు పెట్టే పార్టీలను తరిమి కొట్టేందుకు ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలు సంఘటితంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు లక్ష్మం బాబు, జిల్లా నాయకులు రాజనర్సు, రాజవీర్, ఉపేంద్ర, రాజ్‌కుమార్, రఘు, శంకర్, సుదర్శన్, రాములు, ముత్తయ్య, రాజు, నాంపెల్లి, చంద్రం, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

సిరిసిల్ల క్రైం, మార్చి 26: రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమించిన తమపై కేసులు ఎత్తివేయాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమించిన తొమ్మిది మందికి వారెంట్ జారీ అయ్యింది. దీంతో వారు మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారులు చొక్కాల రాము, కంసాల మల్లేశం, రమాకాంత్‌రావు, మల్లేశ్‌యాదవ్, టోని, మైలారం తిరుపతి, ఎండీ సలీం, రాగుల రాములు పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, మార్చి 26: పెంచిన టెట్ ఫీజును ప్రభుత్వం తగ్గించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టెట్ నిర్వహణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, గతం కంటే అదనంగా ఫీజు పెంచడం ద్వారా నిరుద్యోగులైన యువతపై పెనుభారం పడుతోందన్నారు. పోటీ పరీక్షలకు ఫీజులు వసూలు చేయబోమని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక అధిక ఫీజులను వసూలు చేయడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్వీ నాయకులు మట్టి శ్రీనివాస్, స్వామి, రాజు, నవీన్, శ్రావన్, సుజిత్, నరేష్, తిరపతి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం కార్యవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మానుక కిషన్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా లంబ బాలకిషన్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 26: యాసంగి ధాన్యాన్ని ప్రణాళికా బద్ధంగా సేకరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి ధాన్యం కొనుగోళ్ల, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణపై కలెక్టర్ అనురాగ్ జయంతితోపాటు సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. ఎక్కడా ప్రజాప్రతినిధులు పాల్గొనవద్దని సూచించారు. యాసంగి పంట కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కల్గకుండా మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున టెంట్లు వేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడీక్లీనర్లు, తేమ యంత్రాలు, వేయింగ్ మిషన్‌లు, టార్పలిన్‌లు, గన్నీ సంచులను సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్‌మిల్లులకు తరలించేందుకు వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. చివరి గింజవరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదనే సందేశాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లాలన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతంపై విస్తృతంగా



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

అవగాహన కల్పించాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలన్నారు. రైస్‌మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైస్‌మిల్లర్ల వద్ద హమాలీల కొరత లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. జిల్లాలో వరి సాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలన్నారు. వర్షాకాలానికి సంబంధించిన సీఎంఆర్ రా రైస్ డెలివరీని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, ఎఫ్‌సీఐ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా జిల్లాలో రైస్ మిల్లుల పని తీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని అన్నారు. సీఎంఆర్ రా రైస్ డెలివరీ పై కలెక్టర్ శ్రద్ధ వహించాలని సూచించారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

వేసవికాలంలో జిల్లాలోని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలను అరికట్టాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్, ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాల్టీలు, గ్రామపంచాయతీల పరిధిలో తాగునీటి సరఫరాను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో తాగునీటి అవసరాల మేరకు బోరుబావులను, పాత తాగునీటి సరఫరా మోటార్లను పునరుద్ధరించాలని అన్నారు. తాగునీటి సరఫరా నిమిత్తం అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని, ఎక్కడా నిధుల ఆటంకం లేనందున అత్యంత ప్రాధాన్యంతో తాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ నీటిసరఫరా శాఖ పరిధిలో ఉన్న తాగునీటి వ్యవస్థను పరిశీలించాలని, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ మున్సిపాల్టీలో చివరి వార్డు వరకు తాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సరఫరాలో అంతరాయం ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఆర్‌డీవో శేషాద్రి, డీపీవో వీరబుచ్చయ్య, డీఏవో భాస్కర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువుతో నష్టపోయిన రైతులు



పంటలను పరిశీలిస్తున్న వినోద్‌కుమార్, రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, మార్చి 26: కాలం తెచ్చిన కరువు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువుతో రైతులు తీవ్రంగా నష్టపోయారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. పొలాల సందర్శన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రహీంఖాన్‌పేటలో ఎండిన పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ వద్ద 100 రోజుల్లో 50 టీఎంసీల నీరు వృథాగా పోయి సముద్రంలో కలుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మూడు పిల్లర్లు కుంగితే ప్రాజెక్టు పనిచేయదన్నట్లు పేర్కొనడం సరికాదన్నారు. కాపర్‌డ్యాం కట్టి రైతులకు సాగునీరు అందిస్తే పంటలు ఎండిపోయేవి కాదన్నారు. రైతులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేశారని, వారి పరిస్థితి దయనీయంగా మారడానికి ప్రభుత్వ వైఖరే కారణమని అన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. జడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గొట్టెపర్తి పర్శరాం, నర్సయ్యయాదవ్, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణురావు, నాయకులు బిల్లవేని పర్శరాం, గుండ ముత్తయ్య, కేమీవ నర్‌రెడ్డి, ఉడుతల వెంకన్న, బుచ్చిరెడ్డి, గాదె కనుకయ్య, చంద్రయ్య, పర్శరాం, కూన నరేష్, సాయి, కనుకయ్య, కొమురయ్య, సంతోష్‌రెడ్డి, జక్కుల నాగరాజు, సంపత్, రాజేశం, రమేష్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖంలో బావుల తవ్వకంపై ఫిర్యాదు

ముస్తాబాద్, మార్చి 26: మండలంలోని మోర్రాపూర్ రేగులకుంట చెరువు శిఖం భూమిలో కొందరు ప్రైవేటు వ్యక్తులు బావులు తవ్వుతున్నారని మాజీ సర్పంచ్ దేవేందర్, గ్రామస్థులు తహసీల్దార్ సురేశ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. రేగులకుంట చెరువు బావిపై మోర్రాపూర్, తెనుగువానిపల్లె ప్రజలు ఆధారపడి ఉన్నారన్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కొంటే రేగుల కుంటలో గల బావి ఆదుకుంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు చెరువు శిఖంలో బావులు తవ్వుతున్నారని ఆరోపించారు. దానిని నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు బట్టు దుర్గయ్య, కిషన్, రాజు నాయక్, చంద్రయ్య, రాములు, బాబు నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు వేసవి భత్యం చెల్లించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 26: ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వం వేసవి భత్యం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు, జిల్లా నాయకుడు బాచుపల్లి శంకర్ మాట్లాడారు. వేసవి కాలంలో ఉపాధి హామీ కూలీలను ప్రోత్సహించడానికి తీసుకొచ్చిన వేసవి భత్యం కోసం ఈ సంవత్సరం అదనపు బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మూడు సంవత్సరాలుగా వేసవి భత్యం నిలిచిపోయిందన్నారు. ఈ సంవత్సరమైనా అమలు చేయాలని, వేసవి భత్యానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ సంవత్సరం జనవరి మాసంలో వ్యవసాయ పనులు పూర్తి అవుతాయన్నారు. ఫిబ్రవరి నుంచి మే వరకు ఎండ తీవ్రత పెరుగుతుందని, కూలీలు పనులకు రాలేకపోతారని అన్నారు. ఫిబ్రవరిలో 20 శాతం మార్చిలో 25 శాతం, ఏప్రిల్‌లో 30 శాతం, మేలో 25 శాతం వేసవి భత్యం చెల్లించేవారని, మూడు సంవత్సరాలుగా వేసవి భత్యాన్ని ప్రభుత్వం నిలిపివేసిందని అన్నారు. ఉపాధిహామీ పథకం మొదలు పెట్టిన నాటి నుంచి ఉన్న సాఫ్ట్‌వేర్ తొలగించి కొత్త సాఫ్ట్‌వేర్ మార్చారన్నారు. ప్రభుత్వం స్పందించి వేసవి భత్యంతోపాటు కూలీల బకాయిలను చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

చంద్రంపేట కౌన్సిలర్‌కు పరామర్శ

సిరిసిల్ల రూరల్, మార్చి 26: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు చంద్రంపేట కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డిని మంగళవారం రాత్రి మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, న్యాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గుడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. కౌన్సిలర్ రాజిరెడ్డి మామా రొండ్ల వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉమ్మడి కరీంనగర్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ నాయకులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

వేములవాడ రూరల్, మార్చి 26: మండలంలోని ఎదురుగట్లలో ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన పొన్నం పర్శరాం కుటుంబానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తరఫున కాంగ్రెస్ నాయకులు మంగళవారం క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ కరుణాకర్, నాయకులు పొన్నం మల్లేశం, రాజేశం, రామస్వామి, గంగారెడ్డి, బాలయ్య, నాగేందర్, కిషన్, ప్రకాష్ పాల్గొన్నారు.

నేతన్నలకు తక్షణ సహాయం అందించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 26: వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి కోల్పోయిన నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10వేల చొప్పున అందజేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని భద్రవతి సంఘం భవనం ఆవరణలో మంగళవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలంటూ మరమగ్గాల కార్మికులతోపాటు అనుబంధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులతో సంతకాలు, వినతి పత్రాలు సేకరించారు. అనంతరం పాలిస్టర్ అసోషియేషన్ భవనంలో కార్యదర్శి వెల్దండి దేవదాస్, బూట్ల నవీన్‌ను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో మూడు నెలల నుంచి నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందని, కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10వేల చొప్పున అందించాలన్నారు. గత సంవత్సరం తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన పదిశాతం యారన్ సబ్సిడీ ఇవ్వాలని, వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని కోరారు. కార్మికులకు ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వ



వినతిపత్రాలను పదర్శిస్తున్న కార్మికులు

ఆర్డర్‌లను అందించాలన్నారు. సిరిసిల్ల పాలిస్టర్ యాజమానులు పరిశ్రమలను తెరిచి కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లెసత్యం, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, నాయకులు ఉడుత రవి, నక్క దేవదాస్, గుండు రమేష్, అడెపు సంపత్,ఒగ్గు గణేష్, ఎలిగేటి రాజశేఖర్, మచ్చ వేణు, సబ్బని చంద్రకాంత్, మోరతిరుపతి, బెజుగం సురేష్, గోరంతల రాజమల్లు, వేణు, హరిదాసు, సదానందం, ప్రవీణ్, విజయ్, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి



సాయితేజ (ఫైల్)

● వైద్య చేయించలేని దయనీయ పరిస్థితి

ఇల్లంతకుంట, మార్చి 26: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌కు చెందిన ఎల్లంకి సాయితేజ(14) అనే విద్యార్థి మంగళవారం పాఠశాల ఆవరణలో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని కందికట్కూర్‌కు చెందిన సాయితేజకు పుట్టినప్పటి నుంచి గుండెకు రంధ్రం ఉంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజూలాగే మంగళవారం పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలలో భోజనం చేసిన కొద్దిసేపటికి వాష్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి అక్కడే కుప్పకూలాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు చెప్పారని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

కొడుకు గుండెకు రంధ్రం ఉందని తెలిసినా ఆర్థికస్థోమత సరిగా లేక వైద్యం చేయించలేని పరిస్థితి సాయితేజ తల్లిదండ్రులది. మండలంలోని నర్సక్కపేటకు చెందిన శ్రీనివాస్, రేణుక దంపతులు ఉన్న ఊరిలో ఉపాధి లేక ఇదే మండలం కందికట్కూర్‌కు వచ్చేశారు. పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివించుకుంటున్నారు. సాయితేజ గుండెకు రంధ్రం ఉండడం, మరోకుమారు మూర్ఛవ్యాధితో బాధపడుతుండడం కూలీ పనులు చేసుకునేవారికి భారమైంది. సాయితేజకు సర్జరీ చేయాలని వైద్యులు చెప్పినా ఇల్లుగడవని పరిస్థితుల్లో ఎలా చేయిస్తామని దిగులుపడే వారు. చివరికి సాయితేజ మృతి వారికి తీరని శోకాన్ని మిగిల్చింది.

పేదలకు భారం కావద్దనే ఉచితంగా ఇసుక



మాట్లాడుతున్న జడ్పీటీసీ గుండం నర్సయ్య

ముస్తాబాద్, మార్చి 26: ఇల్లు నిర్మించుకునే పేద ప్రజలకు భారం కాకూడదనే డీడీలు లేకుండా ఉచితంగా ఇసుకను అందించేలా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని జడ్పీటీసీ గుండం నర్సయ్య అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గుండం నర్సయ్య మాట్లాడుతూ ఇసుక మాఫియా, దళారుల బెడద లేకుండా బడుగు బలహీన వర్గాల కోసం ఉచితంగా ఇసుకను అందజేయడానికి నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వం పదేళ్లుగా క్వారీలను ఏర్పాటు చేసి ఇష్టానుసరంగా ఇసుకను అమ్ముకుందని మండిపడ్డారు. ఇల్లు కట్టుకునే పేదవాడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ కరెడ్ల కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు రంజాని నరేశ్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు తలారి నర్సింలు, బీసీ సెల్ అధ్యక్షులు శీల ప్రశాంత్, నాయకులు తాడెపు కొమురయ్య, కొప్పు రమేశ్, సద్ది మధు, అంజనేయులు, ఉచ్చిడి బాల్‌రెడ్డి తదితతరులు పాల్గొన్నారు.

నేత కార్మికులను రోడ్డున పడేశారు



మాట్లాడుతున్న టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రవీణ్

సిరిసిల్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యం పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 110 రోజుల్లో కరెంట్ కోతలతోపాటు సిరిసిల్ల నేత కార్మికులను రోడ్డున పడేసిందని పవర్‌లూం టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించే దిశగా కేటీఆర్ బతుకమ్మ చీరలు, రాజీవ్ విద్యా మిషన్, కేసీఆర్ కిట్‌లు, రంజాన్, క్రిస్మస్ పండుగలకు గిఫ్ట్ ప్యాక్‌లను అందించడం ద్వారా రూ.3400 కోట్ల ఆర్డర్లను ఇప్పించారన్నారు. దీంతో సిరిసిల్లలోని నేత కార్మికులు చేతినిండ పనితో బతికారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, ఇప్పటికే ఒక కార్మికుడు బలవనర్మణం చెందాడని అన్నారు. కాంగ్రెస్ హయాంలో గతంలో జరిగిన సంఘటనలే పునరావృతం కావాలా? అని ప్రశ్నించారు. ఏడాదిపాటు పని కల్పిస్తామని జీవో ఇచ్చారని సంవత్సరంపాటు పని కల్పించడానికి బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరలు వ్యాపారం కాదని, కేవలం నేత కార్మికులకు పని కల్పించడానికి మానవతా ధృక్పథంతో అందిస్తున్న ఆర్డర్లని గతంలో కేసీఆర్ స్పష్టం చేశారన్నారు. అధికారులు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడం జరగదని చెబుతున్న క్రమంలో ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించాలన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ పద్మశాలీలకు ప్రధాన ఉపాధియైన వస్త్రోత్పత్తి రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. సిరిసిల్లలో పవర్‌లూం యజమానులు, ఆసాములను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పెట్టుబడులు రావనే భయానికి బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నారని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఇతర నాయకులు ఆర్డర్లపై మభ్య పెడుతున్నారని, కడుపు కాలిన కార్మికులకు ఏదైనా జరిగితే కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులను రోడ్డున పడేసిన ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. ఈ సమావేశంలో పద్మశాలీ సంఘం జిల్లా కార్యదర్శి దిడ్డి రాజు, పద్మశాలీ సంఘం యువజన అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, బీఆర్ఎస్ కార్యదర్శి మ్యాన రవి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు రాపెల్లి దినేష్, గెంట్యాల శ్రీనివాస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, రామచంద్రం, బాలరాజు, సామల శ్రీనివాస్, కంచర్ల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తే నాయకుడికి పట్టం కట్టాలి



మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, మార్చి 26: సమస్యలపై గళమెత్తే నాయకుడికే పట్టం కట్టాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండలం గజసింవరంలో మంగళవారం సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలోని సింగిల్‌విండో చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో ఉండి పోరాడిన వ్యక్తుల్లో బోయినపల్లి వినోద్‌కుమార్ ఒకరన్నారు. కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో మన ప్రాంతానికి వినోద్‌కుమార్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. లోక్‌సభలో అనేక సమస్యలపై వినోద్‌కుమార్ తన గళాన్ని వినిపించారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఓటేసి గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. సహకార సంఘాల చైర్మన్లు భూపతి, ఉచ్చిడి మొహన్‌రెడ్డి, గుండారం కిష్టారెడ్డి, దేవగౌడ్, భాస్కర్, వైస్ చైర్మెన్లు రామాంజనేయులు, డైరెక్టర్లు రాజిరెడ్డి, నర్సయ్య, దేవరెడ్డి, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

అత్యంత ప్రమాదకరంగా బీజేపీ ప్రభుత్వం



సిరిసిల్లలో మాట్లాడుతున్న చీటి ఉమేష్‌రావు

సిరిసిల్ల టౌన్, మార్చి 26: దేశంలో బీజేపీ ప్రభుత్వం అత్యంత ప్రమాదకరంగా మారిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అతి పెద్ద కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్స్ భారత రాజ్యాంగానికి వ్యతిరేఖమని సుప్రీంకోర్టు తీర్పును ప్రజలంతా స్వాగతించారన్నారు. బండారం బయట పడుతుందని జూన్ 30 వరకు వివరాలు అందిస్తామని బీజేపీ సుప్రీం కోర్టును కోరిందన్నారు. జూన్ 30 వరకు ఎన్నికలు పూర్తవుతాయనే ఉద్దేశంతో బీజేపీ ఎత్తుగడ వేసిందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ రూపకంగా దాతల నుంచి బీజేపీ రూ.26,566 కోట్లు తీసుకుందని, దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు కలసి దాదాపు రూ.12వేల కోట్లు మాత్రమే తీసుకున్నాయని అన్నారు. ఇండియా కూటమిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక కాంగ్రెస్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలన్న ఆలోచనతో 11 కాంగ్రెస్ పార్టీకి చెందిన అఫిషల్ అకౌంట్స్‌ను బీజేపీ ప్రభుత్వం ఫ్రీజ్ చేసిందన్నారు. లిక్కర్ స్కాం అనేది కేవలం కల్పితమన్నారు. లిక్కర్ స్కాం పేరుతో ఢిల్లీ ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రిని ఈడీ ద్వారా అరెస్టు చేయిస్తోందన్నారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్‌ని అసెంబ్లీ ఎన్నికలో కరీంనగర్ ప్రజలు తిరస్కరించారన్నారు. కరీంనగర్ ఎంపీగా సిరిసిల్లకు ఎన్నిసార్లు వచ్చారని, సిరిసిల్ల నియోజకవర్గానికి ఏం చేశారని అన్ని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలలో ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారన్నారు. రాముడు, అయోధ్య రథయాత్రలు చేయడం అయోధ్య అక్షింతలు పంచడం, రెచ్చగొట్టే ప్రసంగాలతో యువతను ఆగం చేసే చిల్లర పనులు తప్పా నిర్దిష్టమైన విధానం బండి సంజయ్‌కి లేదని విమర్శించారు. సిరిసిల్లలో ఏం సమస్యలు ఉన్నయో తెలుసా? అని ప్రశ్నించారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉందని, కేంద్రం నుంచి ఎంపీగా ఏం తీసుకురాగలిగినావని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, 350 ఎంపీ సీట్లతో ఇండియా కూటమి గెలిస్తుందని దేశ ప్రధాన మంత్రి రాహుల్‌గాంధీ అవుతారని అన్నారు. కరీంనగర్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కూతురు వెంకటరెడ్డి, నాయకులు వెంగళ అశోక్, కె.రియాజ్, రెడ్డిమల్ల భాను, ఎడమల భూపాల్‌రెడ్డి, శ్రీరాముల వెంకటేశం, ఎండి అహ్మద్, మల్లేశ్‌బాబు, మేకల కమలాకర్, తాటికొండ శ్రీనివాస్, దత్తు, మహిపాల్, మోషిన్, సిందం శ్రీనివాస్, వెంకటేశం, కిరణ్ పాల్గొన్నారు.